ప్రజాశక్తి

బుధవారం 18 అక్టోబర్ 2023

5

శ్రీ సత్యసాయి

'చితి'కిపోయిన పసిహృదయం

◆ జ్వరంతో బాలుడు మృతి

◆ మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వని ప్రభుత్వ వైద్యులు

◆ ద్విచక్రవాహనంలో 30 కిలోమీటర్లు తీసుకెళ్లిన తల్లిదండ్రులు

◆ మడకశిరలో అమానవీయ ఘటన

కుమారున్ని ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

మృతి చెందిన రుషి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మడకశిర

రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం వారిది. భార్యాభర్తలు ఇద్దరూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వీరికి ఒక్కగానొక్క కుమారుడు రుషి(5) ఉన్నారు. కూలి పనులు చేసుకుంటున్నా కుమారున్ని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. కంటికిరెప్పలా చూసుకుంటూ ప్రాణాలన్నీ కుమారునిపైనే పెట్టుకున్నారు. ఇంతప్రేమగా చూసుకుంటున్న కుమారుడు జ్వరంబారిన పడ్డాడు. గత వారం రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్సలు చేయించినా నయం కాలేదు. దీంతో మంగళవారం ఉదయం చికిత్స కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు కన్నుమూశాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కుమారుని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ఆసుపత్రిలో ఆంబులెన్స్‌ను అడిగారు. వైద్యులు అంబులెన్స్‌ను ఇచ్చేందుకు అంగీకరించలేదు. వీరి గ్రామానికి ప్రయివేటు ఆంబులెన్స్‌లో కుమారుని మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ప్రయివేటు వాహనదారులు రూ.5 వేల వరకు అడుగుతారు. ఇంత డబ్బు పెట్టలేని ఆ కూలీ దంపతులు కుమారుని మృతదేహాన్ని వారు వచ్చిన ద్విచక్రవాహనంలోనే తీసుకెళ్లారు. దాదాపు 30 కిలోమీటర్లు తల్లి కుమారున్ని ఎత్తుకోగా, తండ్రి వాహనం నడుపుతూ తీసుకెళ్లాడు. ఈ ఘటనను చూసిన వారికి కన్నీళ్లు తెప్పించింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన పేదలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్షంగా నిలుస్తోంది.

కళ్లెదుటే కుమారుడు మృతి

మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి చెందిన రాధమ్మ, పాతలింగప్పలు భార్యాభర్తలు. వీరికి ఒక్కగానొక్క కమారుడు ఋుషి(5) ఉన్నాడు. గత వారం రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్సలు చేయించినా నయం కాకపోవడంతో మంగళవారం నాడు చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన గంటల వ్యవధిలోనే చిన్నారి మృతి చెందాడు. తల్లిదండ్రుల కళ్లేదుటే కుమారుడు మరణించాడు.

అంబులెన్స్ ఇవ్వని వైద్యులు

కుమారుడు మృతి చెందడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లేందుకు ఆసుపత్రిలోని ఆంబులెన్స్ ఇవ్వాలని తల్లిదండ్రులు వైద్యులను అడిగారు. అయితే ఏవో సాకులు చెప్పి ఆంబులెన్స్ ఇచ్చేందుకు వీల్లేదంటూ వైద్యులు తెలిపారు. దీంతో ప్రయివేటు వాహనదారులను సంప్రదించారు. వారు రూ.5 వేల వరకు బాడుగు అడగడంతో అంత ఇచ్చే స్తోమత లేని తల్లిదండ్రులు కుమారున్ని వారి ద్విచక్రవాహనంలో సొంతూరుకు తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. తండ్రి వాహనం నడపగా, తల్లి కుమారున్ని భుజంపై వేసుకుని 30 కిలోమీటర్ల దూరంలోని వారి ఊరి వరకు తీసుకెళ్లారు. బాలుని మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్నారని తెలిసినా వైద్య సిబ్బంది ఎవరూ కూడా స్పందించకపోవడం గమనార్హం. తమకు సంబంధం లేని విషయం అన్నట్లుగా అక్కడి సిబ్బంది వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సర్వే నెంబర్ 805లో గుడిసెలు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, పేదలు

పట్టాలిచ్చే వరకూ పోరాటం

నివాసయోగ్యమైన ప్రదేశంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

805లో గుడిసెలు వేసుకున్న పేదలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరులో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకూ పోరాటం ఆపేది లేదని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు స్పష్టం చేశారు. అధికారులు కంటితుడుపు చర్యలను మాని నివాసయోగ్యమైన స్థలంలో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో భాగంగా సర్వే నెంబర్ 805లో మంగళవారం నాడు మరోసారి పేదలు గుడిసెలను వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత నెల రోజులుగా చిలమత్తూరులో పేదలు ఇళ్ల పట్టాల కోసం వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సచివాలయాలు మొదలు కలెక్టర్ కార్యాలయం వరకు అందరి వద్దకెళ్లి వారి కష్టాలను తెలియజేశారన్నారు. అధికారులు కంటితుడుపు హామీలు ఇస్తున్నారే తప్పా ఇళ్ల స్థలాలపై ఎలాంటి స్పష్టమైన హామీని ఇవ్వలేదన్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే నివాసయోగ్యమైన ప్రదేశంలో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థల పరిశీలనతోనే కాలక్షేపం చేసే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. స్థానిక తహశీల్దార్ ఇళ్ల పట్టాలపై కావాలనే నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించాల్సింది పోయి దానిని మరింత జఠిలం చేయడం సరికాదన్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు 805 సర్వే నెంబర్‌లోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తామన్నారు. వైసిపి హిందూపురం ఇన్‌ఛార్జి దీపిక, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి చొరవ తీసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, లక్ష్మీనారాయణ, రామచంద్ర, రహమ్మతుల్లా, రాయల చందు, మంజు, శివ, రియాజ్, సదాశివరెడ్డి, చంద్ర, చరణ్, మణిస్వామి, ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపిఇఒల చివరి ఆశ

◆ రెండేళ్లుగా గాల్లో దీపాల్లా మారిన ఉద్యోగాలు ◆ రేషనలైజేషన్‌లోనే దక్కుతుందన్న ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎంపిఇఒ (మల్టిపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు) ఉద్యోగాలు గాల్లో దీపాల్లాగా మారాయి. రేషనలైజేషన్‌లోనైనా తమ ఉద్యోగాలు నిలబడతాయోనన్న చివరి ఆశలతో ఎదురు చూస్తున్నారు. గ్రామీణ స్థాయిలో వ్యవసాయ విస్తరణ కోసమని ప్రభుత్వం గతంలో వీరిని నియమించింది. 2019లో వచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా వీరిలో చాలా మందికి పనిచేయడానికి చోటు లేకుండాపోయింది. వీరందరూ అప్పటి నుంచి గాల్లో దీపాల్లాగా మారారు. ప్రారంభంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 475 మంది ఎంపిఇఒలు ఉండేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటై అందులో వివిధ పోస్టులు భర్తీ తరువాత వీరికి పోస్టుల్లేకుండా పోయాయి. దీంతో వారిలో ఆందోళన నెలకొనడంతో ఖాళీ పోస్టుల్లో కొంత వరకు సర్దుబాటు చేశారు. దీని ప్రకారం అనంతపురం జిల్లాలో 213 మందిని సర్దుబాటు చేయగా , 262 మందిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఇందులో చిత్తూరు జిల్లాలో 105కి పోస్టింగ్ లభించాయి. తక్కిన 157 మందికి పోస్టుల్లేకుండాపోవడంతో అప్పటి నుంచి గాల్లోనే ఉంటూ వస్తున్నారు. అనంతపురం జిల్లాలో 213లో 53 మందికి పోస్టింగుల్లేవు. మొత్తం 210 మంది పోస్టింగుల్లేకుండా గడిచిన రెండేళ్లకుపైగా ఉంటూ వస్తున్నారు. వీరు విధుల్లో చేరకుంటే తొలగిస్తామన్న తాఖీదులను ప్రభుత్వం 2022లోనే జారీ చేసింది. ఈ క్రమంలో ఇప్పుడు వ్యవసాయ శాఖలో జరుగుతున్న మార్పులు చిన్న ఆశను రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల్లో అవసరమైన చోట కొంత మంది ఉండగా అవసరం లేని వారు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ సమయంలో రేషనలైజేషన్ చేయాలన్న యోచన నడుస్తున్నట్టు సమాచారం. ఈ సర్దుబాటుల్లో ఖాళీ పోస్టుల్లో గాల్లోనున్న ఎంపిఇఒలకు అవకాశం లభిస్తుందేమోనన్న ఆశలు కొంత వరకున్నాయి. వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టి తమకు విధుల్లోకి తీసుకోవాలని ఎంపిఇఒలు విజ్ఞప్తులు సైతం చేస్తున్నారు. వేతనాల్లేక , ఉద్యోగాలు ఉంటాయో లేదే తెలియక జీవితాలు అత్యంత దుర్భరంగా గడుస్తున్నాయని ఎంపిఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతోనున్నారు.

ఎంపిఇఒల సమస్యను పరిష్కరించాలి

ఎంపిఒలు గత కొంతకాలం గాల్లోనున్నారు. విధుల్లేక పోవడంతో జీతాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని వారిని వీధుల్లోకి తీసుకోవాలి. సర్దుబాట్లుచేసి అవసరమైన చోట సిబ్బందిని వినియోగించాలి. గ్రామీణ స్థాయిలో వ్యవసాయంలో మెళకువలు చెప్పేందుకు అవసరమైన సిబ్బందిలో వీరు కూడా కీలకంగానే వ్యవహరిస్తారు. అనేక సంవత్సరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఎంపిఇఒలను వీధుల్లోకి తీసుకుని వారికి కుటుంబాలకు భద్రతనివ్వాలి.

నాగేంద్రకుమార్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

యథేచ్ఛగా చెట్ల నరివేత

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో చెట్లను నరికివేసిన దృశ్యం

అటవీశాఖ అధికారుల అండదండలు ఉంటే చెట్లు ఎక్కడా ఉన్నా...అవి ఎవరివి అయినా ఏ సమయంలోనైన అడ్డంగా నరికివేసి సామిల్స్, పరిశ్రమలకు తరలించుకోవడం సుసాధ్యమని పట్టణంలో జరుగుతున్న తీరు చూస్తే అర్థం అవుతోంది. గత ప్రభుత్వం హయాంలో నీరు–చెట్టు పేరుతో పురపాలక సంఘ వారు లక్షలాది రూపాయలు వెచ్చించి పట్టణంలో చెట్లను నాటారు. పట్టణంలో నీటి ఎద్దడి ఉన్నా ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేసి వాటికి నీరందించి పెంచారు. చెట్లను నరకడానికి వీలు లేదని ప్రభుత్వం చట్టాలను సైతం చేసింది. అయితే అటవీశాఖలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఆ చట్టాలను తుంగలోకి తొక్కి కలప మాఫియాకు పూర్తిగా సహకరించాడన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఆ ఉద్యోగి అండదండలతో కొంత మంది పగలు రాత్రి అన్న తేడా లేకుండా పట్టణంలోని రైల్వే రోడ్డు, లేపాక్షి రోడ్డు, బైపాస్ రోడ్డులో ఉన్న చెట్లను నరికివేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం సైతం కలప మాఫియా ఈ ప్రాంతాల్లో ఉన్న చెట్లను నరికి దర్జాగా ట్రాక్టర్ల ద్వారా తరలించారు. హిందూపురాన్ని హరిత పురంగా మార్చాలన్న సంకల్పంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పురపాలక సంఘం వారు పెంచిన చెట్లను పురపాలక సంఘం అధికారుల అనుమతులు లేకుండా యథేచ్ఛగా నరికివేస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కలప మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సాగు భూమి ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

అర్హులైన పేదలను గుర్తించి సాగు భూమితో పాటు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేశు, వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తచెరువు లోనే సంత మార్కెట్లో సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో ఇప్పటికీ భూమిలేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని అలాంటి వారిని గుర్తించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అర్హులైన పేదలకు ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలన్నారు అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని అధికారులను కోరుతామన్నారు. ఈసందర్భగా తొమ్మిది మందితో భూ పోరాట కమిటీ ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ముత్యాలు, కో కన్వీనర్‌గా శ్రావణిని ఎన్నుకున్నారు. వీరి ఆధ్వర్యంలోనే గ్రామాల్లో అర్హులైన పేదలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి సాంబశివ, బాళ్ల అంజి, సిపిఎం గంగాధర్, నాయకులు రామాంజనేయులు నాగభూషణ్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

19న 'జగనన్న చేదోడు సాయం అందజేత కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో అర్హులైన 14,795 మంది లబ్ధిదారులకు రూ.14.795 కోట్లు మంజూరు అయిందని దీనిని ఈనెల 19వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన షాపులు ఉన్న రజక, నాయి బ్రాహ్మణ, టైలరింగ్ వారికి పదివేల రూపాయలు చొప్పున ప్రభుత్వం జగన్న చేదోడు కింద ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. నాలుగవ విడతగా జగనన్న తోడు పథకం ద్వారా లబ్ధిదారులు సహాయం అందుకుని అభివద్ధి చెందాలని కోరారు. వెనుకబడిన తరగతులు, చేతివత్తుల వారి అభివద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతలు మంజూరు చేసిందని, ప్రస్తుతం నాలుగో విడతగా ఈ ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. 19న కలెక్టరేట్లో ఉదయం 10 గంటలకు స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తామన్నారు.

కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని సుందరయ్యనగర్ పాలడైరీ సమీపంలో కుక్కల స్వైరవిహారం ఎక్కువయ్యాయి. విద్యార్థులు, చిన్నపిల్లలపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. మంగళవారం ఉదయం సంతోష్ కుమార్ అనే విద్యార్థిపై కుక్కలు దాడి చేసి విచక్షణారహితంగా కరిచాయి. అరచేతితోపాటు భుజంపైన కరవడంతో బాలుడికి రక్తగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి కుక్కలను తరిమివేశారు. బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో కుక్కల నుంచి విద్యార్థులు, చిన్నారులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ రాస్తారోకో

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం హెుట్టబెట్ట గ్రామంలో నెలకొన్న తాగునీటి కోసం గ్రామంలోని మహిళలు ఖాళీబిందెలతో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. తమకు తాగునీటి సమస్య తీర్చేంతవరకు కదిలేది లేదని మహిళలు ప్రధాన రహదారిపై భీష్మించుకొని కూర్చున్నారు. కనీసం పండుగ సమయంలోనైనా సమస్య తీర్చలేదని తమ సమస్యను ఎవరితో చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఎంపీడీవో అక్కడికి చేరుకొని గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. నిధులు లేకపోవడంతో బోరు వేయలేక పోతున్నామని తాత్కాలికంగా ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

రాస్తారోకోలో పాల్గొన్న మహిళలు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

వేళాపాల లేని విద్యుత్ కోతలతో మండలంలోని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ రఫీ, బండ్లపల్లి సర్పంచి గీతాబాయి అలివేలమ్మ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హెల్త్ సూపర్వైజర్ కిష్టప్ప మాట్లాడుతూ మండలంలో పిహెచ్‌సి లేక వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నామని బుక్కపట్నం పిహెచ్‌సికి అటాచ్ చేశారని తక్షణమే మండలంలో పిహెచ్‌సిని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగాదేవి, మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్, ఎంపీడీవో బారన్‌సాబ్‌తో పాటు ఆయా

శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు క్లాసుల నిర్వహణతో విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏ కోచింగ్ సెంటర్లు కూడా సమయపాలన పాటించడంలేదన్నారు. విద్యార్థులు మానసికంగా ఇబ్బందికి గురైతే అందుకు యాజమాన్యాలు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జానకిరామయ్య సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జానకీ రామయ్య ఘాట్ వద్ద నివాళి

సత్య సాయి బాబా సోదరుడు ఆర్ వి జానకిరామయ్య పుట్టపర్తి కి చేసిన సేవలు వెలకట్టలేనివని పలువురు కొనియాడారు. జానకీరామయ్య 20వ వర్థంతి సందర్భంగా మంగళవారం ఆయన ఘాట్ వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, కుటుంబ సభ్యులు పలువురు రాజకీయ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా కావాలని ఆయన చేసిన కృషి వల్లే జిల్లా అవతరించిందన్నారు. ట్రస్ట్ సభ్యుడిగా అటు ప్రజలకు ఇటు ట్రస్టుకు మధ్య వారధిగా పనిచేసే పుట్టపర్తి అభివృద్ధికి ఎంతో చేశారన్నారు. ఆయన కృషి వల్లే నేడు పుట్టపర్తి ఎంతో అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కులశేఖర్ రాజు, ప్రశాంతి గ్యాస్ నిర్వాహకులు పివి సూర్యనారాయణ, రాజీవ్ దేవ్, మాజీ పుడా చైర్మన్ కోటా సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాయలకాలంలో నీటికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి గోరంట్ల

సమావేశంలో పాల్గొన్న మైనాస్వామి, తదితరులు

శ్రీకృష్ణదేవరాయల నీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని విజయనగర సామ్రాజ్యంలో వ్యవసాయ అభివృద్ధి గొప్పగా జరిగిందని చరిత్రకారుడు మైనా స్వామి చెప్పారు. పట్టణంలో జరిగిన శ్రీక్రిష్ణదేవరాయల 494 వ వర్థంతి సందర్భంగా చరిత్రకారుడు మైన స్వామి మాట్లాడుతూ నీటి వనరుల అభివృద్ధికి రాయలు విశేషంగా కృషి చేశారని అన్నారు. కొత్తచెరువులు తవ్వించడం ఉన్న చెరువులను పటిష్ట పరచడం నదుల ద్వారా నీటిని చెరువులకు మళ్లించడం వంటి పనుల ద్వారా రాజ్యంలో తరి సేద్యం బాగా అభివృద్ధి జరిగిందన్నారు. నీటి వనరులను విశేషంగా అభివృద్ధి చేయడం వల్ల పంటలు సమృద్ధిగా పండుతుండడంతో రాజ్యంలో ఆహార కొరత లేకుండా మిగులు సాధించినట్లు చరిత్రకారులు రాశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో విశ్రాంత కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు అనిమెల లక్ష్మీపతి, మనోహర్ నాయక్, నాగేంద్ర రాయల్, శివప్ప యాదవ్, హర్షవర్ధన్ రెడ్డి, జయరాం రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి కదిరి అర్బన్

వృత్తినే దైవంగా భావించి న్యాయం అనే పదానికి వన్నెతెచ్చిన వ్యక్తి న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి అని న్యాయమూర్తులు మీనా సుందరి, విజయలక్ష్మికొనియాడారు. మంగళవారం స్థానిక బార్ కౌన్సిల్ హాల్లో ఏర్పాటుచేసిన చంద్రశేఖర్ రెడ్డి సంతాప సభను బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగాలలోకేశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లింగాల వాసుదేవరెడ్డి, గురు లింగస్వామి, కృష్ణమూర్తి, సివి కృష్ణమూర్తి, రామ్మోహన్ రెడ్డి, నాగేంద్ర, శివ ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, నరసింహులు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభలో పాల్గొన్న న్యాయమూర్తులు

రికార్డుల ఆధారంగానే పనులు చేశాం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - పరిగి

తాము ఆకాశరామన్న ఉత్తరాలకు బెదరమని రికార్డులు ఆధారంగానే పనులు చేశామని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల మధ్య గొడవలు ఘర్షణలు సృష్టించేందుకు కొంతమంది ఆకాశరామన్న ఉత్తరాల ద్వారా జిల్లా స్థాయి అధికారులకు ఉత్తరాలు రాస్తున్నారన్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న సచివాలయ, వీఆర్ఎలపై తహశీల్దార్ చిందులు వేసినట్లు లేఖలో తెలపడం అదేవిధంగా మండలంలోని ఒక స్వచ్ఛంద సంస్థకు చెందిన భూమిని అదే కుటుంబ సభ్యులకు వన్ బి, అడంగల్ చేయించిందనే అంశాలపై లేఖలో వివరించడంపై ఆమె స్పందించారు. అంతేకాకుండా మండలంలోని సీగుపల్లికి చెందిన వివాదాస్పద భూమి వివాదంలో కార్యాలయం నుండి ఆ కుటుంబానికి వంశవృక్షం సర్టిఫికెట్ అందించి రెవిన్యూ అధికారులు అవినీతికి పాల్పడ్డారని లేఖలో తెలిపారన్నారు. పరిగిలోని షుగర్ ఫ్యాక్టరీ భూమి కోర్టులో ఉన్నప్పటికీ అందుకు సంబంధించి సబ్ డివిజన్ చేయడమే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో మద్దతు పలికారని లేఖలో పేర్కొనడాన్ని తహశీల్దార్ ఖండించారు. ప్రతిది రెవెన్యూ రికార్డు ఆధారంగానే పనులు చేశామని తామేమి ప్రభుత్వ జీవోలకు వ్యతిరేకంగా కోర్టులకు వ్యతిరేకంగా పనులు చేయలేదని అన్నారు. ఇలాంటి అకాశరామన్న ఉత్తరాలతో తహశీల్దార్ కార్యాలయ పనితీరును తప్పుపట్టి తమ గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అయితే ఈ లేఖ పంపడంలో రెవిన్యూ అధికారుల హస్తం ఉందని ఈ కార్యాలయంలో పనిచేసిన వ్యక్తి ఇతర మండలానికి బదిలీ కావడంతో కక్ష సాధింపు చర్యలో భాగంగానే ఈ ఆకాశ రామన్న లేఖను అధికారులకు ప్రజాప్రతినిధులకు పంపినట్లు మండల వ్యాప్తంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహశీల్దార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విబి భాస్కర్ రెడ్డి, పెనుగొండ తాలూకా అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్, సల్మాన్, పరిగి మండల వీఆర్వో సంఘం అధ్యక్షులు నరసింహులు, సచివాలయ మండల అధ్యక్షుడు దర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇప్పించండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

పెండింగ్ లో ఉన్న 6 నెలల వేతనాలు ఇప్పించాలని కోడూరు పంచాయతీకి చెందిన స్వచ్ఛభారత్, పారిశుధ్య కార్మికులు వైసిపి హిందూపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపిక ముందు మొరపెట్టుకున్నారు. ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆమెకు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారు. వినాయక చవితి పండుగ కూడా చేసుకోలేదని వేతనాలు ఇప్పిస్తే దసరా పండుగైన చేసుకుంటామని అన్నారు. స్పందించిన దీపిక సర్పంచిని పిలిపించి ఎందుకు 6 నెలల వేతనాలు ఇవ్వలేదని ఆరా తీశారు. పంచాయతీలకు రావల్సిన స్టాంప్ డ్యూటీ పన్ను రానందువలన ఇబ్బందులు పడుతున్నామని అది వచ్చిన వెంటనే చెల్లిస్తామని సర్పంచి మురళీ అన్నారు. ఏది ఏమైన కార్మికులుకు వెంటనే వేతనాలు చెల్లించాలని దీపిక సూచించారు.

15 రోజుల్లో అర్హులందరికీ ఇళ్లపట్టాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

15 రోజుల లోపు అర్హులైన వారందరికి ఇంటిపట్టాలు ఇచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని హిందూపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపిక స్థానిక తహశీల్దార్ నాగరాజుకి సూచించారు. ఈమేరకు మండలంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష అనంతరం దీపిక స్థానిక విలేకరులతో మాట్లాడారు. లేఅవుట్ కోసం స్థల పరిశీలన వేగవంతం చేసి స్కెచ్ వేసి పట్టాలు మంజూరు చేసి ఆ తర్వత కనీస మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని తహశీల్దార్‌కు సూచించామన్నారు. అలాగే కోడూరు కి సంబందించిన లబ్ధిదారులకు కోడూరు సమీపంలోని 353 సర్వేనెంబర్‌లో స్థలాన్ని గుర్తించినట్లు తహశీల్దార్ తెలిపారని అన్నారు. అలాగే చిలమత్తూరు సంబందించిన లబ్దిదారులకు చిలమత్తూరు సమీపంలో స్థలాన్ని గుర్తించి పట్టాలు ఇచ్చే పనిని వేగవంతం చేయాలని సూచించామన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

గాండ్లపెంట : మండల పరిధిలోని కమతంపల్లి వద్ద మంగళవారం బులోరా వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. కదిరి మార్కెట్ యార్డ్ సంతలో గొర్రెలు విక్రయించి తిరుగు ప్రయాణంలో బొలెరో వాహనంకంతంపల్లి వద్దకు రాగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యారు. గాండ్లపెంట మండలానికి చెందిన బద్దె నాయక్, లక్ష్మీనారాయణ, తిరుపాల్, ఎన్ పి కుంట మండలానికి చెందిన ఆంజనేయులు గాయపడ్డారు. వీరిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

వాహనాల తనిఖీ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి, జాతీయ రహదారిపై ఎస్ఐ వంశీకృష్ణ వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనయజమానులకు చలానా విధించారు. ఈకార్యక్రమంలో పోలీసులు మూర్తి, భాస్కర్, మహేష్ రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కండక్టర్ ఇంట్లో చోరీ

కొత్తచెరువు : మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు రిటైర్డ్ కండక్టర్ రామాంజనేయులు ఇంటికి ఉన్న తాళాన్ని పగులకొట్టి ఇంటిలోకి చొరబడి ఏడు తులాల బంగారం, 50వేల రూపాయల నగదును చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పార్టీలోకి చేరిన వారితో గుండుమల తిప్పేస్వామి

టిడిపిలో పలువురి చేరిక

మడకశిర : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వైసిపి నుండి టిడిపిలోకి చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలువురు నాయకులు టిడిపిలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిధిలోని అమరాపురం మండలం వీరాపురం గ్రామానికి చెందిన గోవిందు, శివకుమార్, శశికుమార్, చందు, చిరంజీవి, మోహన్, రామకృష్ణ, శ్రీనివాస్, వీరేశ్, శ్రీరామప్పతో పాటు 40 కుటుంబాల సభ్యులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి , జిల్లా కార్యదర్శి నరసింహ మూర్తి, అమలాపురం మండలం కన్వీనర్ గణేష్, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్, పంచాయతీ అధ్యక్షులు నాగరాజు, మండల ఎస్సీ అధ్యక్షుడు చెన్నప్ప, మాజీ డీలర్ రఘు, సీనియర్ నాయకులు రమేష్, దేవరాజు, రంగనాథ్, శివ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన

గుడిబండ : బాల్య వివాహాల నిర్మూలనపై స్థానిక వెలుగు కార్యాలయంలో గుడిబండ మండలం చందన మార్గదర్శి వివో ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి హనుమంతరాయప్ప, ఎపిఎం ముత్యాలప్ప, ఎంఎస్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రందన దీక్షలను జయప్రదం చేయండి

మడకశిర : ఉపాధ్యాయులు ఇవ్వాల్సిన వివిధ రకాల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20,21 తేదీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో చేపడుతున్న ఆక్రందన దీక్షలను జయప్రదం చేయాలని ఎస్‌టియు జిల్లా నాయకులు టి. ఆదినారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్జిత సెలవు, జీవిత బీమా, పిఆర్‌సితో పాటు కరువు భత్యం బకాయిలు దాదాపు 800 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టే ఆక్రందన దీక్షలకు చెందిన పోస్టర్లు ఎంఇఒ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిప్పేస్వామి ,రామ్మోహన్, రామాంజి, వీరేష్, ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : దసరా సెలవుల్లో గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు కొత్త చెరువులోనే శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, పాఠకులు మహమ్మద్, కిష్టప్ప, రమేష్, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

గాండ్లపెంట : మండల పరిధిలోని గొడ్డి వెలగల సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్ కుమార్‌కు అనంతపురం జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో రామా నాయక్ తెలిపారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాల అమలులో ప్రతి లబ్ధిదారు దగ్గర రూ. 2వేలనుంచి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని స్థానిక సర్పంచులు, ఎంపీపీ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అందుకు స్పందించి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన

గోరంట్ల రూరల్ : మండలం లోని వడిగేపల్లి యూపి స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు,అందులో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో న్యూట్రీషన్ స్టాల్ ఏర్పాటు చేశారు,.

గొర్రెల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి - లేపాక్షి

గొర్రెల పెంపకం లాభదాయమని లేపాక్షి పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మోహన్ రావు అన్నారు. స్థానిక వెలుగు సమావేశ భవనంలో ఆధ్వర్యంలో మంగళవారం గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హిందూపురం డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్. పెంచలయ్య మాట్లాడుతూ గొర్రెల పెంపకం చేపట్టే రైతులు మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుండి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చని మాస్టర్ ట్రైనర్ డాక్టర్, శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. వైరస్ వలన సంక్రమించే వ్యాధుల నివారణపై అందించాల్సిన చికిత్సలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై రైతులకు డాక్టర్ శ్రీనివాసులు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోపశువైద్యాధికారులు డాక్టర్. పురుషోత్తం రెడ్డి, కిషోర్, జయశ్రీ , జయ కుమార్ రెడ్డి ,ప్యాపిలి గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం పశువైద్యాధికారి శ్రీనివాసులు, పలు గ్రామాల గొర్రెల పెంపకదారులు, ఇతర పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎపిడికి పీడీగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా మహిళా అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిక అధికారి లక్ష్మీ కుమారిని జిల్లాకు రెగ్యులర్ పీడీగా ఉద్యోగోన్నతి కల్పించారు. దీంతో జిల్లాలోని సిడిపివోలు మంగళవారం ఆమెను అభినందించారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఆమెకు మంగళవారం ఉత్తర్వులు అందినట్లు లక్ష్మి కుమారి తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా ఏర్పడిన నాటి నుండి లక్ష్మీ కుమారి జిల్లాలో ఇన్చార్జి పీడీగా విధులు నిర్వర్తిస్తోంది, ఈమె విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించడం , శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో ఎలాంటి, సమస్యలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించినందుకు ఆమెకు ప్రభుత్వం ఇదే స్థానంలో పీడీగా బాధ్యతలు అప్పగించింది .ఈ సందర్భంగా జిల్లాలోని సిడిపిఒలు ఆమెకు అభినందనలు తెలిపారు. అంతకు మునుపు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జరిగిన జిల్లా సమగ్ర అభివద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది నారాయణరెడ్డి, సిడిపిఒలు శాంతలక్ష్మి, రెడ్డి రమణమ్మ, గాయిత్రి, నాగమల్లేశ్వరి, రాధిక, అనురాధ, సరస్వతి, లక్ష్మి, వరలక్ష్మి, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - బత్తలపల్లి

జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు మంగళవారం తాడిమర్రి మండల కేంద్రంలో గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన సంక్షేమ పాలనగా కొనసాగుతోందన్నారు. ఈ డిసిఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ ఆరువేటిరామాంజనేయులు , సచివాలయ కన్వీనర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- హిందూపురం

రూరల్ మండలంలో ఉన్న పి ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన పిఎల్‌సి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కళాశాల ఆవరణంలో ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపల్ రమేష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఐటి. ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా చివరి సంవత్సరం విద్యార్థులు బెంగళూరు లో ఎలైన్ టెక్నాలజీ సంస్థలో పిఎల్‌సి శిక్షణ విజయవంతంగా పూర్తి అయిందన్నారు.

ఎస్‌యుసిఐ ఆధ్వర్యంలో నిరసన

హిందూపురం : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ జియోనిస్టు సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ ఎస్‌యుసిఐ ఆధ్వర్యంలో మంగళవారం బాలాజీ సర్కిల్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సత్యసాయి జిల్లా కార్యదర్శి గిరీష్ మాట్లాడుతూ, ఈ దిగ్బంధాన్ని ఎస్‌యుసిఐ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, జివిఎన్ అశోక్, వి రంగనాయకులు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మామిళ్ళకుంట్లపల్లి , తోటి వారి పల్లి, వడ్డీ వారి పల్లి, ఎం కొత్తపల్లి, సుందరయ్య కాలనీ గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి వారికి బుక్లెట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, తహశీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, షామీర్, సర్పంచులు గోవిందు, రంగారెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న పల్లె రఘునాథరెడ్డి

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ పగడవాండ్లపల్లిలో బాబుతో నేను సైతం అనే కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, బోయపల్లి శివారెడ్డి, ఆర్‌ఎంపి కృష్ణమూర్తి, మీసేవ సుధాకర్, అంజనరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండలంలోని బీడీ మర్రి ,గంగిరెడ్డి పల్లి, కొడవండ్లపల్లి, బండ్లపల్లి, రంగాపురం, ఈదులపల్లి, చిన్నకోట్ల ,రాఘవపల్లి ,మొగలిచెట్లపల్లి ,చిత్రవారి పల్లి, బుధనాంపల్లి, పదకొండు గ్రామాలలో గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజల సంతకాల సేకరణతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, దేవేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జయకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటికి సాగనంపుదామనిటిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా కదిరి పట్టణం 17వ వార్డు లో ప్రతి ఇంటికి తిరిగి ముఖ్యమంత్రి ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 17వ కౌన్సర్ సవిత్రమ్మ,,ఇనాయత్, మహబూబ్ పీరా, రాజశేఖర్, జెఎస్.మన్సూర్, చాంద్‌బాషా, రమణమ్మ, గౌరమ్మ, లక్ష్మీ దేవి, క్రిష్టమ్మ, అంజినమ్మ, రెడ్డమ్మ, రమాదేవి, నాగలక్ష్మి, రామనుజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

బత్తలపల్లి : దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలను పురస్కరించుకొని మూడవ రోజు మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలోనూ, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ,సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలోని మహాంకాళీమాత ఆలయాల్లోనూ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణదేవరాయల పాలన జనరంజకం

పుట్టపర్తి అర్బన్ : శ్రీకృష్ణదేవరాయల పాలన జనరంజకంగా సాగిందని నేటి పాలకులకు ఆయన ఆదర్శంగా నిలిచారని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం స్థానిక సాయి ఆరామంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత దామోదర్ మాట్లాడుతూ కాపు, బలిజ తెలగలందరూ ఐక్యంగా ఉండి జాతి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాయల్స్ పీపుల్ ఫ్రంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పూల శివప్రసాద్ మాట్లాడుతూ కృష్ణదేవరాయలు కాలంలో తాను తవ్వించిన చెరువులే కాకుండా ఎన్నో గుడులు, గోపురాలు ప్రాచీన కట్టడాలు మన జిల్లాలో అధికంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రాచీన కట్టడాలు కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రభుత్వం వాటిని పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాము చిమ్మినాల జగన్నాథ్, ఆదినారాయణ, మల్లికార్జున, మాజీ కో ఆప్షన్ మెంబర్ శ్రీనివాసులు, బొగ్గరం శ్రీనివాసులు, బాలగంగాధర్, దాసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆత్మీయట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్, రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం, ఆత్మీయట్రస్టు చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 18సంవత్సరాల నుండి 45 కేజీల బరువు ఉండి 100 సంవత్సరాలలోపు ఉన్న ఆరోగ్య వంతులు మూడునెలల కొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం 286 మంది విద్యార్థులకు ఉచిత బ్లడ్ గ్రూపింగ్ నిర్వహించి బ్లడ్ గ్రూపింగ్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, వీర, సంజయ్ కుమారెడ్డి, శివారెడ్డి, తరుణ్, కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, తెలుగు అధ్యాకులు రంగారెడ్డి, కళాశాల ఎఒ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం

ప్రజల వద్దకే వైద్య సేవలు

సమావేశంలో మాట్లాడుతున్న బత్తపల్లి ఎంపిపి

లేపాక్షిలోని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, తదితరులు

ప్రజాశక్తి బత్తలపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వినూత్న ఆలోచనలతో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ముంగిటకే వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ, వైసిపి మండల కన్వీనర్ జయరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచి అక్కిం కాశమ్మ, ఉప సర్పంచి కోటి గోపీనాథ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి, ఎంపీటీసీ కోటీ నరేష్ కుమార్,ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ గంగిరెడ్డి, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలోని మైదుగోళం గ్రామం లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ బాబు మాట్లాడుతూ పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఇఒఆర్డఇ శివన్న, వైద్యులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : .పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ తెలిపారు కొత్తచెరువులోనే రెండవ సచివాలయం సంబంధించి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, డాక్టర్లు జీవన్ బాబు, సునీల్ కుమార్, మమత, కార్యదర్శి గోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

అమరాపురం : మండల పరిధిలోని కెంకెర గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో ఎంపీడీవో మునిస్వామి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్ బాబు, ఎంపిపి ఈరన్న, జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మించేందుకు ప్రభుత్వం నడుం బిగించిందని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. మండలంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి మురళి, తిరుమలేష్, వైస్ ఎంపిపి అంజలీదేవి, బయప్ప, మంజునాథ్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘంలోని 16వ వార్డులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నిమున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ హారతి, వైసిపి నాయకులు ఫరూఖ్, వైద్యులు వెంకటరమణ, కీర్తి, మంజుళ, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష ఒక వరమని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు అన్నారు.కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్ల పల్లి -1 సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిసిహెచ్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య అధికారులు ప్రమీల, విద్యాసాగర్, బాబా ఫకృద్దీన్ తదితరులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరవాండ్లపల్లి గ్రామ సర్పంచి శాంతమ్మ బాయి , వైస్ ఎంపీపీ బత్తల రామలక్ష్మమ్మ , ఎంపీటీసీ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ శ్రీధర్ రెడ్డి. సర్పంచి రూప తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జానకంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మమత, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, అగ్రి అడ్వైజర్ రమణారెడ్డి, తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.